సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 22 । జనవరి । 2024



పెళ్లికి మరో ముడి

పెళ్లంటే నూరేళ్ల పంట అని నమ్మే మన సమాజంలో వివాహానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అయితే ఆ వివాహానికి రిజిస్ట్రేషన్ ద్వారా చట్టబద్ధత అవసరం.


8లో



ఉత్సాహంగా జాతీయ టెన్నిస్ పోటీలు

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్-19 పురుషుల లాన్ టెన్నిస్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి.

10,950 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 10,950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 10.10 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

31న 'నన్నయ' వర్సిటీ స్నాతకోత్సవం



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానిస్తున్న వీసీ పద్మరాజు

రాజానగరం: తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద యూనివర్సిటీగా విరాజిల్లుతున్న ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 31న స్నాతకోత్సవం జరుగనుంది. ఈ వేడుకలకు హాజరుకావలసిందిగా రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను వీసీ ఆచార్య కె. పద్మరాజు ఆదివారం ఆహ్వానించారు. విజయవాడ రాజ్‌భవన్‌లో ఆయనను కలసి వీసీ ఆహ్వాన పత్రం అందజేశారు. కరోనా వైరస్ పరిస్థితుల తరువాత యూనివర్సిటీలో 2019 నుంచి స్నాతకోత్సవాలు జరగడం లేదు. దీంతో 2019 - 20, 2020 - 21, 2021 - 22 విద్యా సంవత్సరాలలో పీజీ, పీహెచ్‌డీలు పూర్తి చేసిన 500 మంది విద్యార్థులకు ఈ స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలు అందజేయనున్నారు.

నేడు యథావిధిగా స్పందన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజల నుంచి సంబంధిత సిబ్బంది స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీలు స్వీకరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు.

ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.2,40,720 ఆదాయం వచ్చిందన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

రాష్ట్ర పరీక్షల సంచాలకుడు దేవానందరెడ్డి



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర పరీక్షల సంచాలకుడు దేవానందరెడ్డి

ప్రకాశం నగర్ : మార్చి 18 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు డి.దేవానందరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఎఈఈఓలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దేవానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ స్వాగతం పలికారు. సమావేశంలో దేవానందరెడ్డి మాట్లాడుతూ పది పరీక్షలకు ఇప్పటి నుంచి ఏర్పాట్లు ప్రణాళికా బద్ధంగా చేసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలలో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, టాయిలెట్ సౌకర్యం, మంచినీటి వసతి, ఫర్నిచర్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. మండల స్థాయి అధికారులైన తహసీల్దార్, వైద్య ఆరోగ్య సిబ్బంది, పోలీస్ శాఖాధికారులతో మాట్లాడి సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాలలో రూమ్‌లు, స్పాట్ కేంద్ర నిర్వహణకు సరిపడా ఫర్నిచర్, టాయిలెట్ సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, పేపర్ బండిల్స్ భద్ర పరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ రిపోర్ట్స్ నిమిత్తం ఇంటర్ నెట్ సౌకర్యం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గత సంవత్సరం పది మూల్యాంకన సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, పరిష్కరించిన వైనం, తీసుకున్న చర్యలు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం వివరించారు. జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రాజు, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఛాయాదేవి, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని టీవీ శారదాదేవి పాల్గొన్నారు.

ఇల గోదారి పరవళ్లలో అల రాములోరి ఆనవాళ్లు



ధవళేశ్వరం రామపాదాల రేవు

- అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ వేళ నందడి
- ఉమ్మడి జిల్లాలో పెల్లుబుకుతున్న భక్తిపారవశ్యం
- వనవాసంలో సీతారాముల పాద స్పర్శతో పునీతమైన ఉభయ గోదావరి తీరాలు
- బ్రహ్మహత్యా దోష నివారణకు రామ ప్రతిష్ఠిత శివలింగాలెన్నెన్నో..
- పండగ శోభతో కనువిందు చేస్తున్న ఆలయాలు

సాక్షి అమలాపురం: 'రామో విగ్రహవాన్ ధర్మః' ఈ వాక్యం చాలు ధర్మం రాశీభూతమైతే రాముడిలా ఉంటుందని చెప్పడానికి. రాముడికి వాల్మీకి ఇచ్చిన నిర్వచనం ఇదే.

లోకాభిరాముడు.. జగదేక రాముడు.. శ్రీరాముడు.. ఏకపత్నీవ్రతుడు.. పితృవాక్య పరిపాలకుడు.. ఒకే మాట.. ఒకే బాణం.. ఒకే సతి.. వినయశీలుడు ఇవన్నీ రామాయణాన్ని చదివిన, విన్నవారికి రాముని గురించి అనిపించిన గుణశీల సంపన్నములు. శ్రీకృష్ణుడు 'ఏం చేసైనా ధర్మాన్ని నిలబెట్టాలి' అని చెబితే.. 'ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మం వైపు నిలబడి బతకాలని' రాముడు దిశానిర్దేశం చేశాడు.. ఆచరించి చూపించాడు.

ఏటా శ్రీరామ నవమికి ప్రతి రామాలయంలో, ప్రతి ఇంటా జరిగే పట్టాభిషేకాన్ని చూసి అక్షతలు శిరసున వేసుకున్నా.. నేడు అయోధ్యలో జరిగే విగ్రహ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు ప్రసార మాధ్యమాల ద్వారా వీక్షించే ప్రతి భక్తునికీ రామాయణ బాలకాండలోని విశేషాలు సాక్షాత్కరిస్తాయనడంలో అతిశయోక్తి లేదు. అయోధ్యలో రూపుదిద్దుకున్న భవ్య రామ మందిరంలో బాలరాముని దివ్యరూపం కొలువుదీరుతున్న వేళ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పండగ వాతావరణం నెలకొంది. ఈ క్రతువు జరుగుతున్న శుభ గడియలు ఆసన్నమవుతున్న తరుణంలో వాల్మీకి అరణ్యకాండలో ప్రస్తావించిన గోదావరి జిల్లాలతో శ్రీరాముని అనుబంధనాన్ని భక్తులు గుర్తు చేసుకుని పులకరించిపోతున్నారు. శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠకు అనుబంధంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మురిసిపోతున్నారు.

తండ్రి మాట జవదాటని శ్రీరాముడు సీతా సమేతంగా వనవాసానికి వెళ్లిపోయాడు. ఈ సమయంలోనే రామయ్య సీతా సమేతంగా తమ్ముడు లక్ష్మణుడితో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నడయాడారని భక్తుల విశ్వాసం. స్వయంగా శ్రీరాముడు ప్రతిష్ఠించిన పలు శివాలయాలు.. ఆలయాలు.. గోదావరి నదీతీరంలో పుణ్యస్నానాలు చేసిన ప్రాంతాలు.. వాటిని రామఘాట్ అంటూ పిలుచుకుంటూ భక్తులు రామునిపై తమ విశ్వాసాన్ని చాటుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శ్రీరాముని వనవాసానికి సంబంధించి పలు పురాణ గాథలున్నాయి. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ఆలయాలూ ఉన్నాయి.

> **అంతా రామమయం**
>
> అయోధ్యలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపనను దేశ వ్యాప్తంగా హిందువులు పండగగా భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎటు చూసినా రామనామమే వినిపిస్తోంది. శ్రీరాముని ఆలయాల వద్దనే కాదు.. ప్రతి ఆలయం వద్దా అయోధ్య రామాలయ ప్రతిష్ఠ సందడి నెలకొంది. ఆలయాలు, ఇళ్లు, వ్యాపార, వాణిజ్య కేంద్రాల వద్ద హనుమంతుని జెండాలను తగిలించి భక్తిని చాటుకుంటున్నారు. పలు దుకాణాల వద్ద ఈ జెండాల విక్రయం జోరుగా సాగుతోంది. ఆలయాల వద్దనే కాదు, చివరకు చాలా మంది సెల్‌ఫోన్ రింగ్ టోన్లు కూడా 'జై శ్రీరామ్' నినాదాన్నే పెట్టుకుంటున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల డీపీలు రాముని చిత్రాలతో నిండిపోతున్నాయి. ఊరూవాడా ప్రత్యేక యాత్రలు, భజనలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు అయోధ్య తరలివెళ్లారు. ఊరూవాడా శ్రీరామ మహా శోభాయాత్రలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 'జై శ్రీరామ్' నినాదం మార్మోగుతోంది.

- అల్లవరం మండలం ఎస్.పల్లిపాలెం శివారు నక్కా రామేశ్వరం తీర ప్రాంతంలోని పార్వతి సమేత శివాలయాన్ని త్రేతాయుగంలో శ్రీరాముడు నిర్మించడం వల్లే రామేశ్వరాలయంగా పిలుస్తారని భక్తుల విశ్వాసం. రావణాసురుడిని అంతమొందించిన శ్రీరాముడు బ్రహ్మ హత్యా దోషానికి పరిహారంగా కాశీ నుంచి శివలింగాన్ని తెప్పించి సముద్రతీరంలో ప్రతిష్ఠించాలని భావిస్తాడు. ఈ క్రమంలో లంక నుంచి అయోధ్యకు వెళుతున్న సమయంలో కాశీ నుంచి శివలింగాన్ని తీసుకురావలసిందిగా హనుమంతుడికి ప్రతిపాదిస్తాడు. సూర్యాస్తమయం కావస్తుండడం, శివలింగం రావడం ఆలస్యం కావడంతో రామేశ్వర క్షేత్రంలో ఇసుకతో సముద్రతీరంలో శివ లింగాన్ని తయారుచేసి ప్రతిష్ఠించి పూజలు చేసినట్లు ఈ క్షేత్రం పురాణ గాథ.



గొల్లల మామిడాడ రామాలయం

- ఇదే మండలం మొగళ్లమూరు శివారు లక్ష్మణేశ్వరంలో పార్వతీ సమేత లక్ష్మణేశ్వరస్వామి వారిని లక్ష్మణుడు ప్రతిష్ఠించినట్లు పురాణ గాథ. ఈ ఆలయాన్ని కూడా బ్రహ్మహత్యాదోష నివారణకు రాముని ఆజ్ఞ మేరకు లక్ష్మణుడు నిర్మించినట్టు చెప్తుంటారు. మకర సంక్రాంతి నుంచి జూన్ వరకు మేఘ వర్ణం, జూన్ నుంచి సంక్రాంతి వరకు ధూమ్ర (బూడిద) వర్ణంతో శివలింగం ప్రకాశిస్తుందని పురోహితులు చెబుతున్నారు.
- రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం వద్ద అఖండ గోదావరిని ఆనుకుని రామపాదాల రేవు ఉంది. ఇక్కడ ఉన్న జనార్దన స్వామి ఆలయానికి పూర్వకాలంలో శ్రీరాముడు సీతా సమేతంగా లక్ష్మణ స్వామిని వెంటబెట్టుకుని వచ్చారని, ఇక్కడ పుణ్యస్నానాలు చేశారని నమ్మకం. ఇక్కడ రాముని పాద ముద్రలు కూడా ఉంటాయి. పుష్కరాల సమయంలో ఇక్కడ స్నానాలు చేస్తే పుణ్యమని భక్తుల విశ్వాసం.
- వాల్మీకి రాసిన అరణ్యకాండలో గోదావరి తీరం ప్రస్తావన ఉంది. సీతారాములు వనవాసం చేశారని, సీతాదేవి అపహరణకు గురైన తరువాత ఆమెకు గోదావరి తీరం అంటే ఇష్టమని అక్కడ వెదుకుదామని లక్ష్మణుడితో శ్రీరాముడు అన్నట్టు రాశారు.
- గుడిమెళ్ల రామేశ్వరంలో కృతకృత్య రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు వెళ్లే ముందే శ్రీరాముడు, సీతాదేవి ఇప్పుడున్న సఖినేటిపల్లి వద్ద విశ్రాంతికని ఆగారంటారు. ఆ సమయంలో స్వామి వారు 'సఖీ' ఇదే నేటిపల్లె (పల్లె నిద్ర చేయడం) అన్నారని, అప్పటి నుంచి ఈ ప్రాంతం సఖినేటిపల్లిగా గుర్తింపు పొందిందని చెబుతారు.
- అంబాజీపేట మండలం మాచవరం (నాటి మాసవరం)లో కౌశికానది తీరంలో పుణ్యస్నానాలు చేస్తే బ్రాహ్మణ హత్య మహాపాతకం పోతుందని చెప్పడంతో శ్రీరాముడు ఇక్కడ స్నానం చేసి శివాలయాన్ని ప్రతిష్ఠించారని పూర్వీకులు చెబుతున్నారు. నాటి నుంచి దీనిని శ్రీరామఘాట్‌గా పిలుస్తారు. ఇక్కడ పుష్కరాలకు పుణ్యస్నానాలు చేస్తారు.
- రత్నగిరి సత్యదేవుని ఆలయానికి క్షేత్రపాలకుడు శ్రీరాముడు కావడం మరో విశేషం. సత్యదేవునికి జరిగే ప్రతి వైదిక కార్యక్రమానికి, కల్యాణానికి శ్రీరాముడు పెళ్లిపెద్దగా వ్యవహరిస్తారు.
- గొల్లలమామిడాడ కోదండ రామస్వామి ఆలయం రాష్ట్రంలో కడప జిల్లా ఒంటిమిట్ట తరువాత అంతటి ప్రాముఖ్యం ఉన్న ఆలయం. ఈ ఆలయాన్ని విశిష్టమైన వాస్తు శాస్త్రంతో నిర్మించారు. రెండు భారీ గోపురాలు కలిగి ఉంటాయి. ఈ ఆలయాన్ని 'చిన్న భద్రాది' లేదా 'చిన్న భద్రాచలం' అని కూడా అంటారు. శ్రీరామ నవమి పండగకు ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తారు.
- రావణ వధ తరువాత శ్రీరాముడు సీతా సమేతంగా పుష్పక విమానంలో తిరిగి అయోధ్య వెళ్తుండగా శ్రమణి అనే రుషి భార్య శాపవశాత్తు కురూపిగా మారిపోతుంది. శాప విమోచనకు ఆమె తపస్సు చేస్తుంటుంది. ఆ ప్రదేశానికి వచ్చేసరికి పైన వెళ్తున్న పుష్పక విమానం ఆగిపోతుంది. అది గుర్తించిన రాముడు ఆమెకు క్షణ కాలంలోనే శాప విమోచనం కలిగించాడు. అనంతరం అక్కడ శివ లింగాన్ని ప్రతిష్ఠించాడు. దీంతో ఆ ప్రదేశానికి క్షణ ముక్తేశ్వరం పేరు వచ్చిందని పురాణ గాథ. అలాగే యుద్ధంలో వినియోగించిన అస్త్రాలను ముక్తిగుండంలో వదిలిపెట్టారని భక్తుల విశ్వాసం. ఈ గుండంలోని నీటినే శివలింగానికి అభిషేకిస్తారు.



అంబాజీపేటలో శ్రీరామ భక్తుని ప్రచారం



అంబాజీపేటలో నిర్వహిస్తున్న శ్రీరామ మహా శోభాయాత్ర



అల్లవరం మండలంలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయం

రామ రాజ్యానికి పునాది



మహాత్ముడు గాంధీజీ కోరిన రామారాజ్యానికి పునాది అయోధ్య కానున్నది. రామరాజ్యం అంటే ధర్మబద్ధమైన పరిపాలన. ఐదు శతాబ్దాల అవాంతరాలను దాటుకుని, యావత్ జాతిని ఏకతాటిపై నిలుపుతున్న ఆనంద హేల ఇది. ఒక వర్గానికో.. వర్ణానికో సంబంధించిన అంశం కాదు. భారత జాతికి నడక.. నడత నేర్పిన మర్యాద పురుషోత్తముడు శ్రీరాముడు. సీతారామ లక్ష్మణుల పాద స్పర్శతో గోదావరి నదీ పరివాహకం పునీతమైందని పురాణాలు చెబుతున్నాయి. అందుకు కళ్ల ముందు పలు సాక్ష్యాలున్నాయి.

– డాక్టర్ బీవీఎస్ మూర్తి, విశ్రాంత ఆచార్యుడు, గౌతమి ఓరియంటల్ కళాశాల, రాజమహేంద్రవరం

శ్రీరాముడు స్నానమాడిన ప్రాంతమిది



మాచవరంలో శ్రీరాముడు స్నానం ఆచరించిన కౌశిక నదీ తీరాన్ని శ్రీరామ ఘాట్ అని పిలుస్తారు. రావణుడిని వధించిన తరువాత నాకు ఇంకా దోషాలు ఉన్నాయా? అని శ్రీరాముడు తన గురువుని అడగా, అతని సూచనల మేరకు మాసవరంలో ఉన్న కోసీ నదీ తీరాన స్నానం చేస్తే సకల పాపాలు పోతాయని చెప్పారు. దాంతో శ్రీరాముడు ఇక్కడ స్నానం చేసి శివలింగాన్ని ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. రావణ వధ తరువాత కోనసీమ తీరంలో శ్రీరాముడు ఎన్నో ఆలయాలను ప్రతిష్ఠించాడు.

– మాచరి సూరిబాబు, పురోహితుడు, మాచవరం, అంబాజీపేట మండలం

ఆ స్వప్నం ఫలించి 17 ఏళ్లు



నన్నయ యూనివర్సిటీ ముఖద్వారం

- 2006లో ఏర్పడిన 'నన్నయ' వర్సిటీ
- 31న స్నాతకోత్సవం

రాజానగరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా వాసుల చిరకాల స్వప్నంగా సాకారమైన ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు రాష్ట్రాలలోనే అతి పెద్ద యూనివర్సిటీ పేరొందింది. 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని వెలసిన ఈ యూనివర్సిటీ స్వశక్తితో అచిరకాలంలోనే అభివృద్ధిని సాధిస్తూ, అందరి ప్రశంసలు అందుకుంటూ 17 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2006లో ఏర్పడిన ఈ యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతం సుమారు 400 కళాశాలల వరకు అనుబంధంగా ఉన్నాయి. ఇప్పటికే 12 బితోపాటు ఐఎస్ఓ, ఎబీసీటిఈ, 'నాక్' (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బి ప్లస్ గుర్తింపు వంటి గుర్తింపులను దక్కించుకుంది. గ్రీన్ ఆడిట్, ఎనర్జీ ఆడిట్, జెండర్ సెన్సిటిజేషన్ వంటి గుర్తింపులతో పాటు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డులను కూడా సొంతం చేసుకుంది.

ముళ్ల పొదల నుంచి విద్యా కుసుమాలు

ప్రారంభంలో అద్దె భవనాల్లో అంకురార్పణ చేసుకున్న 'నన్నయ' యూనివర్సిటీ వెలుగుబందలోని 98 ఎకరాల విస్తీర్ణంలో ముళ్లపొదలతో కూడిన చిట్టడవిలో అడుగు పెట్టింది. ఎన్నో ఒడిదొడుకులను, ఆటుపోట్లను ఎదుర్కొంటూ ముళ్లదారిని పూలబాటగా చేసుకుంటూ ఎందరో విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తూ, విద్యా కుసుమాలను విరబూయిస్తోంది. ఇటుక ఇటుక పేర్చి భవంతిని నిర్మించుకున్నట్టుగా అవసరం మేరకు ఒక్కో భవంతిని నిర్మించుకుంటూ 'స్వశక్తి'కి నిలువెత్తు నిదర్శంగా ఆదర్శనీయమైన యూనివర్సిటీగా ఎదుగుతోంది.

> **31న స్నాతకోత్సవం**
>
> ఈ నెల 31న యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 15వ స్నాతకోత్సవం జరుగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. 2019 -20 విద్యా సంవత్సరం నుంచి పీజీ కోర్సులు, పీహెచ్‌డీలు పూర్తి చేసిన 500 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేయనున్నారు.

స్నాతకోత్సవాన్ని విజయవంతం చేద్దాం..రండి



కరోనా వైరస్ పరిస్థితుల తరువాత జరుగుతున్న 15వ స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయడంలో అంతా సహకరించాలి. 13, 14 స్నాతకోత్సవాలను కూడా కలిసి ఈ వేడుకలు జరుగనున్నాయి. రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ అబ్దుల్ నజీర్‌ని ఆహ్వానించాం. ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తాం. ప్రముఖ సంఘసేవకురాలు, రచయిత, కంప్యూటర్ ఇంజనీర్, ఇన్ఫోసిస్, గేట్స్ ఫౌండేషన్స్‌లో కీలక పాత్ర వహించిన పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ని ప్రదానం చేస్తాం.

– ఉపకులపతి ఆచార్య పద్మరాజు, నన్నయ యూనివర్సిటీ

పురుషుని పతనం చేసే మూడు పాపాలు

సామవేదం షణ్ముఖశర్మ



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పరుల సొమ్ము దోచుకోవడం, పరస్త్రీలపై అత్యాచారం, హితైషులను వదిలిపెట్టడమనేవి పురుషుని పతనానికి దారి తీసే ఘోర పాపాలని సమన్వయ సరస్వతి సామ వేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఆదివారం హిందూ సమాజంలో ఆయన 40 వరోజు ప్రవచనంలో ఇంద్రజిత్తు వధను వివరించారు. మాయాయుద్ధ నిపుణుడయిన ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణాలతో వానరులు తీవ్రంగా దెబ్బతిన్నారు. విభీషణుడు దెబ్బతిన్న వానరులను పరిశీలిస్తూండగా, దెబ్బతిన్న జాంబవంతుడు ఆయనతో 'నాయనా! హనుమంతుడు క్షేమమా?' అని అడుగుతాడు. జాంబవంతుని ప్రశ్నకు నివ్వెరపోయిన విభీషణుడు 'తాతా జాంబవంతా! నీవు రామలక్ష్మణుల, సుగ్రీవుని, అంగదుని క్షేమసమాచారం అడగకుండా ఒక్క హనుమంతుని గురించి ఎందుకు అడుగుతున్నావు?' అని సందేహాన్ని వ్యక్తం చేస్తాడు. దానికి జాంబవంతుడు సమాధానం చెబుతూ ఒక్క హనుమంతుడు బతికి ఉంటే, వానరు లు అందరూ జీవించి ఉన్నట్టే, ఒక్క హనుమంతుడు జీవించి లేకపోతే, మనందరం జీవించి ఉన్నా మరణించిన వారితో సమానమేనని వివరిస్తాడు. అభిచార హోమాన్ని చేయడానికి పూనుకున్న ఇంద్రజిత్తును విభీషణుని సూచనపై లక్ష్మణ, హనుమదాది వీరులు చుట్టుముడతారు. అభిచార క్రతువు భంగపడుతుంది. 'నీకు పుత్రసమానుడినైన నన్ను చంపడానికి వైరి పక్షంతో చేతులు కలుపుతున్నా'వని ఇంద్రజిత్తు పినతండ్రి విభీషణుని నిందిస్తాడు. దానికి సమాధానంగా చేతికి చుట్టుకున్న పాముని విదిలించుకునేటట్టు దుర్మార్గుడయిన వారిని, తన వాడయినా విడిచి పెట్టాలని విభీషణుడు చెబుతాడు. లక్ష్మణుడు అభిమంత్రించి ప్రయోగించిన దివ్యాస్త్రంతో ఇంద్రజిత్తు మరణించాడన్న దుర్వార్త విన్న రావణుడు తీవ్రక్రోధంతో సీతను వధించడానికి బయలు దేరుతాడు. సుపార్శ్వుని సలహా మేరకు రావణుడు సీతను వధించడమనే ఆలోచనకు స్వస్తి చెప్పి, మిగిలిన మూల సైన్యాన్ని రామునిపైకి పంపుతాడు. రాముని పరాక్రమం చూసిన దేవతలు ఆశ్చర్యపోతారు. గాలి తీవ్రంగా వీస్తున్నప్పుడు పడిపోతున్న వృక్షాదులు కనపడుతున్నా, వాటిని కూలుస్తున్న గాలి కనపడనట్లే, రామ బాణాలకు నేల కూలుతున్న రాక్షసవీరులు మాత్రమే కనపడుతున్నారని వాల్మీకి మహర్షి వర్ణించారని సామవేదం అన్నారు. ఇంద్రియాలకు దొరికేది ప్రపంచం, దొరకనిది పరమాత్మ అని ఆయన అన్నారు.

> **23వ తేదీన 5.30 గంటలకు ప్రవచనం ప్రారంభం**
>
> ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5.30 గంటలకే ముగింపు ప్రవచనం ప్రారంభం అవుతుందని, 6.30 గంటల నుంచి వివిధ నదీజలాలు, సాగరాల నుంచి తెచ్చిన జలాలతో శాస్త్రోక్తంగా శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం జరుగుతుందని భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు ప్రకటించారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

- జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


తలపడుతున్న క్రీడాకారులు

పిఠాపురం: పిఠాపురం ఓటీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలో 16 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గుబ్బల ఎలీషా తెలిపారు. ఈ పోటీల్లో 30 మంది క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 30, 31 తేదీల్లో మహారాష్ట్ర పూణేలో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పంపించనున్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు ఏపీ ఒలింపిక్ సంఘం సీఈఓ చంద్రు గోవిందరాజులు, మున్సిపల్ కమిషనర్ పీఎస్ఎల్వీ కృష్ణవేణి, పి సత్యనారాయణరెడ్డి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

జాతీయ తైక్వాండోలో జిల్లాకు 12 పతకాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాజస్థాన్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి సీనియర్స్ తైక్వాండో పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిందని జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు ఆదివారం తెలిపారు. జిల్లా నుంచి 15 మంది క్రీడాకారులు పాల్గొనగా 2 బంగారు, 2 రజత, 8 కాంస్యం మొత్తం 12 పతకాలు సాధించారన్నారు. కె.వైష్ణవి, వెంకన్నదొర బంగారు, సౌమ్య, మేరిగోల్డ్ రజత, స్వాతి శ్రీసాయి, శశికళ, అఖిల, శ్రీరామ్, వెంకట నిఖిల్, చరణ్, అఖిల్ కాంస్య పతకాలు అందుకున్నారని తెలిపారు. విజేతలను రాష్ట్ర ఒలింపిక్ సంఘ సీఈఓ చంద్రు గోవిందరాజు తదితరులు అభినందించారు.

పెళ్లికి మరో ముడి



- వివాహ చట్టబద్ధతకు సర్కారు పెద్ద పీట
- ఆన్‌లైన్‌లో వివాహ రిజిస్ట్రేషన్
- సులభంగా ప్రక్రియ
- భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

రాయవరం: పెళ్లంటే నూరేళ్ల పంట అని నమ్మే మన సమాజంలో వివాహానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అయితే ఆ వివాహానికి రిజిస్ట్రేషన్ ద్వారా చట్టబద్ధత అవసరం. వివాహాన్ని చట్టబద్ధం చేయాలనే అంశం చాలామందికి తెలియదు. వివాహానికి చట్టబద్ధత లేకుంటే భవిష్యత్తులో పలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. గతంలో మాన్యువల్‌గా ఉన్న వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు.

గతంలో ఇలా..

గతంలో హిందూ వివాహాలు, ప్రత్యేక వివాహాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాన్యువల్‌గా నమోదయ్యేవి. వివాహానికి సంబంధించిన ఫొటోలు, ఆధార్ కార్డులు సమర్పించి, ముగ్గురు సాక్షులతో దరఖాస్తు పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్‌కు ఇచ్చేవారు. వధువుకు 18, వరుడికి 21 ఏళ్లు పూర్తయితే వివాహానికి చట్టబద్ధత ఇస్తారు. వివాహ శుభలేఖ, పెళ్లి ఫొటోలు, వధూవరుల ఆధార్ కార్డులు, పదో తరగతి ఉత్తీర్ణులైనట్టు ధ్రువీకరణ పత్రం లేదా మరేదైనా వయసు ధ్రువీకరణ పత్రం, ముగ్గురు సాక్షులతో సంతకాలు చేయించిన దరఖాస్తును ఇవ్వాలి. సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి సంతకం చేసిన ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా వివాహ రిజిస్ట్రేషన్ విధానం అమలవుతోంది.

తగిన ఫీజు చెల్లించి..

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.రిజిస్ట్రేషన్స్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రెండు ఆప్షన్లు ఉంటాయి. హిందూ వివాహమైతే దానిపై క్లిక్ చేసి మొబైల్ నంబర్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఓటీపీతో లాగిన్ కావాలి. తర్వాత ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేసి ఆధార్ కార్డులు, ఫొటోలు, పదవ తరగతి ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లేందుకు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సీఎఫ్ఎంఎస్ ద్వారా ఫీజు చెల్లించాలి. తర్వాత ఆన్‌లైన్ దరఖాస్తును సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తే వారు పరిశీలించి సాక్షులతో సంతకాలు పెట్టించుకుని వెంటనే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. రిజిస్ట్రేషన్ అయ్యాక వివాహ ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ సాధారణ సంతకం కాకుండా డిజిటల్ సంతకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. రుసుం సైతం సులభతరంగా చెల్లించే సౌకర్యం కల్పిస్తున్నారు. ఆధార్ అథంటిఫికేషన్ ఆన్‌లైన్‌లో పొందే చర్యలు చేపడుతున్నారు.

ప్రత్యేక వివాహాలకు మరో విధంగా:

హిందూ వివాహ పద్ధతిలో జరగని వాటిని ప్రత్యేక వివాహాలుగా పరిగణిస్తారు. ప్రత్యేక వివాహ రిజిస్ట్రేషన్ దరఖాస్తు విధానం మరోలా ఉంటుంది. నెల రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యంతరాలు తెలుసుకునేందుకు నెల రోజుల పాటు నోటీసులో ఉంచుతారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ముమ్మిడివరంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటుగా, ఆలమూరు, అల్లవరం, అంబాజీపేట, అమలాపురం, ఆత్రేయపురం, ద్రాక్షారామ, ఐ.పోలవరం, కొత్తపేట, మలికిపురం, మామిడికుదురు, మండపేట, ముమ్మిడివరం, రావులపాలెం, రామచంద్రపురం, రాజోలులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. జిల్లాలో ద్రాక్షారామ, అమలాపురం, రామచంద్రపురం, మండపేట, రాజోలు తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నెలకు సరాసరిన 100 వరకు రిజిస్ట్రేషన్స్ చేసుకుంటున్నారు. గతంతో పోలిస్తే ప్రజల్లో అవగాహన పెరిగినట్లు సబ్ రిజిస్ట్రార్లు పేర్కొంటున్నారు.

సులభతరం చేశారు



ఆన్‌లైన్‌తో వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పుడు మరింత సులభతరమైంది. వివాహం చేసుకున్న ప్రతీ జంట తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అది వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వ పథకాలు పొందేందుకు కూడా ఈ రిజిస్ట్రేషన్ ఉపకరిస్తుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు ప్రజల్లో అవగాహన పెరిగింది.

– యు.జగన్మోహన్‌రావు, సబ్ రిజిస్ట్రార్, రామచంద్రపురం

సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది జనవరి నుంచి ఆన్‌లైన్ వివాహ రిజిస్ట్రేషన్ విధానం ప్రారంభమైంది. వివాహ ధ్రువపత్రాలు పొందగోరే వారు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని స్లాట్ బుక్ చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించాలి. రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారానే చెల్లించవచ్చు. వివాహ రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వి.శ్రీనివాస్, జిల్లా రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

విద్యార్థుల భవిష్యత్ పాడవకూడదనే..

- అమలాపురం అల్లర్ల కేసుల ఎత్తివేతపై ఎమ్మెల్సీ కృతజ్ఞతలు


సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: జిల్లాకు పేరు మార్పుపై అనివార్యమైన ఉద్యమంలో భాగంగా పలు విధ్వంసకర ఘటనలపై జిల్లా పోలీసు శాఖ నమోదు చేసిన కేసుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న దృష్ట్యా వారి భవిష్యత్ దెబ్బతినకూడదనే రాష్ట్ర ప్రభుత్వం ఆ కేసులను ఎత్తివేసిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్సీ కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక వర్గాల పరంగా కొన్ని ఒత్తిళ్లు ఉన్నా కేవలం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. ఈ అల్లర్లకు సంబంధించి తొలుత 1200 మందిని జిల్లా పోలీసులు నిందితులుగా గుర్తించినప్పటికీ తర్వాత 950 మంది యువకులను నిర్దోషులుగా ప్రకటించి కేసుల నుంచి తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు ఈ కేసుల రద్దుతో వారిపై పలు సెక్షన్లతో నమోదైన ఆరు కేసుల నుంచి వారికి విముక్తి కలిగిందన్నారు. వారంతా ఆనందంగా ఉన్నారంటే ఈ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో తీసుకున్న నిర్ణయమే కారణమని ఆయన పేర్కొన్నారు. కేసుల విచారణ సమయంలో కొంత మంది నాయకులు పత్తా లేకపోయినప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై నిందలు మోపడం వారి మానసిక పరిస్థితి దెబ్బతిందా అనే అనుమానం కలుగుతోందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పేర్కొన్నారు.

శ్రీరాముని పెద్దరికంలోనే రత్నగిరి ఉత్సవాలు

- అన్నవరం క్షేత్రపాలకుడిగా శ్రీరాముడు
- వందేళ్లకు పైబడి కొనసాగుతున్న ఆనవాయితీ

అన్నవరం: దేశమంతా సోమవారం అయోధ్యలో జరిగే శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. ఎటు చూసినా రామ నామ జపమే వినిపిస్తోంది. అసలు ఈ దేశంలో రాముని గుడి లేని గ్రామం కాని, ప్రదేశం కాని లేదంటే అతిశయోక్తి కాదు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో క్షేత్రపాలకుడిగా సీతారాముల అనుజ్ఞ లేనిదే దేవస్థానంలో సత్యదేవునికి ఏ వైదిక కార్యక్రమం జరగదు. రత్నగిరికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ముందు దర్శనమిచ్చేది సీతారాములు కొలువైన రామాలయం. ఆ తరువాతే సత్యదేవుని ఆలయం.


సత్యదేవుని కల్యాణానికి పెళ్లిపెద్దలుగా వ్యవహరిస్తున్న సీతారాములు (ఫైల్)

సత్యదేవుని పెళ్లికి సీతారాములే పెళ్లిపెద్దలు..

దేవస్థానంలో ప్రతినిత్యం జరిగే సత్యదేవుని నిత్య కల్యాణానికి సీతారాములే పెళ్లిపెద్దలుగా వ్యవహరిస్తారు. ఏటా వైశాఖ శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకు ఏడు రోజుల పాటు జరిగే సత్యదేవుని వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాలకు కూడా సీతారాములే పెళ్లిపెద్దలు. ఉగాది వేడుకలు, కార్తికమాసంలో జరిగే సత్యదేవుని తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ, ఇతర కార్యక్రమాలను సీతారాములే దగ్గరుండి నిర్వహిస్తారు.

రత్నగిరిపై సత్యదేవుడు వెలసి సుమారు 134 సంవత్సరాలు అవుతుండగా అప్పటి నుంచి కూడా సీతారాములే ఈ క్షేత్రానికి పాలకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెల రాముని జన్మ నక్షత్రం పునర్వసు రోజున ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అంతే కాకుండా ఏటా చైత్రశుద్ధ నవమి (శ్రీరామనవమి) నాడు జరిగే సీతారాముల కల్యాణాన్ని కూడా రత్నగిరి పై ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి పెళ్లిపెద్దలుగా వ్యవహరిస్తారు. అలాగే శ్రీరామనవమి వేడుకలు రత్నగిరిపై తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించడం కూడా ఆనవాయితీగా సాగుతోంది.

టీడీపీ, జనసేనలకు భారీ షాక్


బడుగువానిలంకలోని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలను పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

- బడుగువానిలంక నుంచి 300 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మండలంలోని బడుగువానిలంక నుంచి సుమారు 300 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన మహిళలు, నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వగ్రామమైన రావులపాలెం మండలంలోని గోపాలపురం చేరుకున్నారు. సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, ఏపీసీఎస్ చైర్మన్ వీరా రాజు, ఏఎంసీ డైరెక్టర్ కటారి కుమారి, పార్టీ నేత కర్రి నాగిరెడ్డి నేతృత్వంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ, జనసేన అనైతిక పొత్తును ఎట్టి పరిస్థితుల్లోను హర్షించలేమన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా అహ్వానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారిని దర్శించిన 30 వేల మంది
- రూ.30 లక్షల ఆదాయం


సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం : రత్నగిరి సత్యదేవుని సన్నిధికి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ప్రధానంగా ఈ సీజన్‌లో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన భక్తులు స్వామివారి ఆలయానికి ఎక్కువగా వస్తారు. అదే విధంగా ఈ ఏడాది కూడా ఉత్తరాది రాష్ట్రాల భక్తులు స్వామివారి సన్నిధికి భారీగా తరలి వచ్చారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణం భక్త జనసందోహంతో నిండిపోయింది. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఏకాదశి సందర్భంగా సత్యదేవునికి ప్రత్యేక పూజలు

ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం సహస్ర కుంకుమార్చన నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ప్రసాదాలు నివేదించారు.

నేడు ముత్తంగి సేవ

సోమవారం పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అమ్మవారు ముత్యాలతో రూపొందించిన కవచాలను ధరించి (ముత్తంగి సేవ) భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మొక్కల్లో కొలువుదీరిన శ్రీరాముడు



పుల్లా చంటియ్యకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు

కడియం: తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలోని పుల్లా చంటియ్య, పెద సత్యనారాయణకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీలో వివిధ రకాల మొక్కలతో శ్రీరాముని చిత్రం, అయోధ్య రామమందిరం చిత్తరువులను మొక్కల కూర్పుతో ఏర్పాటు చేశారు. 70 అడుగుల పొడవుతో ఏర్పాటు చేసిన ఈ చిత్రాల కోసం దాదాపు లక్షకుపైగా వివిధ రకాల మొక్కలను వినియోగించినట్టు నర్సరీ రైతు పెద సత్యనారాయణ వివరించారు. రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేశామన్నారు. వందలాది మంది కార్మికులతో, దాదాపు అయిదు రోజుల పాటు శ్రమించి ఈ మొక్కల కూర్పును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోదండపాణిగా ఉన్న శ్రీరాముడి చిత్రం, రాముడిని చూస్తున్నట్లుగా ప్రధాని మోదీ చిత్రంతో ఉన్న ఈ కూర్పు ఆకట్టుకుంటోంది. నర్సరీలకు విచ్చేస్తున్న సందర్శకులను కట్టి పడేస్తోంది.

ఉత్సాహంగా జాతీయ టెన్నిస్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ కార్యాలయ ఏడీ రాజశేఖర్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్-19 పురుషుల లాన్ టెన్నిస్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం డీమార్ట్ సమీపంలోని టెన్నిస్ కోర్టులలో నిర్వహించిన మ్యాచ్‌లను ఇన్‌చార్జి డీఈఓ, ఆర్జేడీ నాగమణి, ఎస్పీ ఆఫీసు వెనుక టెన్నిస్ కోర్టులలో పోటీలను అడ్మిన్ ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్ఏ టెన్నిస్ కోర్టులలో మ్యాచ్‌లను రాష్ట్ర పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు, డీఈఓ ఆఫీసు ఏడీ రాజశేఖర్ అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. టీం ఈవెంట్‌లలో 9 మ్యాచ్‌లను నిర్వహించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో మహారాష్ట్ర కేంద్రీయ విద్యాలయం పై 2-1తోను, హర్యానా తెలంగాణపై 2-0 తోను, గుజరాత్ ఆంధ్రప్రదేశ్ పై 2-0తోను విజయం సాధించాయి. అదే విధంగా ఢిల్లీ రాజస్థాన్‌పై 2-0 తోను గెలుపొందాయి. సెమీ ఫైనల్స్‌లో గుజరాత్ ఢిల్లీపై 2-0 స్కోర్‌తోను, హర్యానా మహారాష్ట్రపై 2-1 స్కోర్‌తోను గెలుపొందాయని టోర్నమెంట్ చీఫ్ రిఫరీ శ్రీకుమార్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లను టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి బీవీవీఎస్‌పీ ప్రసాద్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శి శ్రీహరి, పీడీలు పట్టాభి, నూకరాజు, డి.శ్రీను, మాచరరావు, ప్రసాద్‌రెడ్డి, సూరిబాబు, మూర్తి, లక్ష్మి పర్యవేక్షించారు. పోటీలను రాష్ట్ర లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి కుమార్, రిటైర్డ్ పీడీ బండారు అప్పారావు, వివిధ రాష్ట్రాల కోచ్‌లు మేనేజర్లు తిలకించారు.

ఎస్ఈబీ సీఐల బదిలీలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐలకు బదిలీలయ్యాయి. జిల్లా నుంచి ఏడుగురిని బదిలీ చేస్తూ ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఆరుగురి సీఐలను వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు బదిలీ చేశారు.

సీఐలు	ప్రస్తుతం స్థానం	బదిలీ
పీవీ రమణ	రాజమహేంద్రవరం నార్త్	నూజివీడు
జి.సత్యనారాయణ	కోరుకొండ	మచిలీపట్నం
వీటీవీవీ సత్యనారాయణ	కొవ్వూరు	అవనిగడ్డ
జి.వెంకటలక్ష్మి	రంగంపేట	ఉయ్యూరు
డి.సుధ	దేవరపల్లి	కైకలూరు
డీఎస్ఎస్‌పీ ప్రసాద్	డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్, రాజమహేంద్రవరం	చింతలపూడి
ఎస్.మణికాంత్‌రెడ్డి	ఇంటిలిజెన్స్‌వింగ్, రాజమహేంద్రవరం	జగ్గయ్యపేట
జిల్లాకు రానున్న సీఐలు		
ఎస్.నిక్సన్	విజయవాడ తూర్పు	రాజమహేంద్రవరం నార్త్
కె.బంగారురాజు	ఇంటిలిజెన్స్‌వింగ్, కృష్ణా	కోరుకొండ
జి.శ్రీనివాసరావు	జగ్గయ్యపేట	కొవ్వూరు
కె.వెంకటేశ్వరస్వామి	కాకినాడసౌత్	దేవరపల్లి
ఎస్.రాంబాబు	కైకలూరు	రంగంపేట
టి.గోపాలకృష్ణ	నూజివీడు	డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్, రాజమహేంద్రవరం

ముగిసిన చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంవీఏ హాలులో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఆదివారంతో ముగిశాయి. వైఎంవీఏ, ఎంకే చెస్ అకాడమీ సౌజన్యంతో జరిగిన పోటీల్లో ఎం.జ్ఞాన సాయి సంతోష్ తొమ్మిది రౌండ్లకు తొమ్మిది పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. కె.మహేష్ కుమార్, డి.లక్ష్మణరావు, వి.సాత్విక్, ప్రేమసాయి విజేతలుగా నిలిచారు. వీరితోపాటు మరో 15 మందికి రూ.50 వేల నగదు బహుమతిని పంచారు. వైఎంవీఏ కార్యదర్శి విశ్వ కళ్యాణ్, కోశాధికారి కాకి రామకృష్ణ, క్రీడా కార్యదర్శి ఎం. చైతన్య, జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

తుని రూరల్: తుని మండలం తేటగుంట శివాలయం, సాయిబాబా ఆలయాల్లో చోరీలు జరిగాయి. ఆదివారం నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి శివాలయం ప్రాంగణంలో ఆలయం తలుపులు బద్దలుకొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారన్నారు. అమ్మవారి మెడలో మంగళసూత్రం, హుండీ ధ్వంసం చేసి నగదు దోచుకుపోయాడన్నారు. అలాగే సమీపంలోనే ఉన్న సాయిబాబా గుడిలోనూ చోరీ జరిగిందని, బీరువా ధ్వంసం చేశారన్నారు. దుండగులను గుర్తించకుండా ఉండేందుకు సీసీ టీవీల హార్డ్ డిస్క్ సైతం దోచుకున్నారన్నారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఆనవాళ్లు చెదిరిపోకుండా ఉండేందుకు ఆలయంలోకి తాము ప్రవేశించలేదన్నారు. రూ.మూడు లక్షలుసొత్తు చోరీకి గురై ఉంటుందన్నారు. ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామని రూరల్ ఎస్సై విజయబాబు తెలిపారు.